సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం ǀ 6 ǀ నవంబర్ ǀ 2024



డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. రెండోరోజు బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 258 పరుగులు చేసింది. -8లో



సందడి చేసిన కిరణ్ అబ్బవరం

'క' సినిమా హీరో కిరణ్ అబ్బవరం మంగళవారం ప్రొద్దుటూరులో సందడి చేశారు. 'క' సినిమా విజయోత్సవం సందర్భంగా సుధ థియేటర్‌కు వచ్చారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.6/24.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.2 - 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో ఐదు మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని ఐదు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా కొండాపురంలో 6.4 మి.మీ, చాపాడులో 6, కలసపాడులో 5.4, సింహాద్రిపురంలో 2.6, బి.మఠంలో 1.8 మి.మీ వర్షం నమోదయింది. ఈ వర్షం ఆరుతడి పంటలకు కాసింత ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు తెలిపారు.

7న సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో ఈ నెల 7న జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరవుతారని జిల్లాలోని సీనియర్ నాయకులు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని వివరించారు.

12నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలు



బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రభోదకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి ఉత్సవాలు 12నుంచి 14వరకు ఘనంగా జరపనున్నట్లు మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. మంగళవారం బి.మఠంలో ఆయన మట్లాడుతూ బ్రహ్మంగారి జయంతి ఉత్సవాలను ఈనెల 12 మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయన్నారు. 13 బుధవారం బ్రహ్మంగారు జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14 గురువారం భజనలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించాలన్నారు.

బీఓఎస్ చైర్మన్‌గా కోట మృత్యుంజయరావు



వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ లలితకళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లలితకళా విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్ గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. మృత్యుంజయ రావు బీవోఎస్ చైర్మన్‌గా రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. లలితకళలపై వివిధ అంశాలపై సుమారు 50 కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించడంతో పాటు, మూడు పుస్తకాలను ముద్రించారు. ఈయన ఎంపికపై వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ , ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రక్షణ కల్పించాలంటూ మహిళా కార్పొరేటర్ల విజ్ఞప్తి



మీడియాతో మాట్లాడుతున్న పత్తి రాజేశ్వరి

కడప అర్బన్: కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీన జరగనుందని, గత సర్వసభ్య సమావేశంలో మహిళా కార్పొరేటర్లు తమ సీట్లలో కూర్చోనీయకుండా ఎమ్మెల్యే మాధవీరెడ్డి అనచరులుగా వచ్చిన వారు దౌర్జన్యంగా సీట్లలో కూర్చొని వారిని అగౌరవ పరిచారని కడప కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు పత్తి రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న సర్వసభ్య సమావేశంలో ఇలాంటి పరిస్థితి నెలకొనకూడదని, కార్పొరేటర్లను తప్ప మిగతా వారిని సర్వసభ్య సమావేశంలోకి అనుమతించకూడదని వారు కోరా రు. ఈ మేరకు మంగళవారం వారు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజును కలిసి వినతిపత్రమిచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి అనుచరులకు పనేమిటని ప్రశ్నించారు. అనుచరులను అనుమతించవద్దంటూ ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. హక్కుల కోసం తాము ఎస్పీని కలిశామన్నారు. గతంలో వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా కార్పొరేటర్ల భర్తలను పోలీసులు కనీసం కార్యాలయ ఆవరణలోకి కూడా అనుమతించలేదన్నారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు మినహా ఎవరినీ మీటింగ్ హాలులోకి అనుమతించవద్దని కోరారు. మహిళా కార్పొరేటర్లుగా తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గొప్పలు చెప్పుకునేందుకు తిప్పలు!





డీఆర్‌సీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సవిత, చిత్రంలో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- విజన్ 2020 పోయే.... స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం తపనంట!
- కరువు మొర్రో...అంటే నిర్దిష్ట నిర్ణయాల్లేవు
- ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్ పునః ఏర్పాటు ఊసే లేదు
- 50మెడికల్ సీట్లు కోల్పోయినా స్పందించని కూటమి నేతలు
- ఇదీ డీఆర్‌సీ జరిగిన తీరు

సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్ర ప్రభుత్వ గొప్పలు చెప్పుకునేందుకు తిప్పలు మినహా జిల్లా అభివృద్ధిపై నిర్దిష్ట నిర్ణయాలు డీఆర్సీ (డిస్ట్రిక్ట్ రివ్యూ మీటింగ్)లో చేపట్టలేదు. కరువుతో కడప ఎండుతోంది.. కడుపు మండుతోంది ప్రభుత్వం దృష్టి పెట్టాలని ప్రజలు వాపోతుంటే, ఆ దిశగా అధికారపార్టీ ఎమ్మెల్యేలు నోరు మెదపలేదు. పైగా గౌరవ మర్యాదలకు భంగం కలుగుతోందని మంత్రి ఎదుట ఏకరువు పెట్టారు. పరనింద ఆత్మస్తుతి కోసమే డీఆర్సీ ఏర్పాటు మినహా ప్రత్యేకించి జిల్లాకు ఒరిగిందేమి లేదని పలువురు వివరిస్తున్నారు.

- కూటమి నేతల హామీలు చూసి జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు కూటమికి కట్టబెట్టారు ఓటర్లు. అధికార పగ్గాలు చేపట్టాక అభివృద్ధి మాట అటుంచితే ప్రభుత్వం వివక్ష చూపుతోంది. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులుగా న్యాయమైన కోర్కెలు, సమస్యలపై కూడా ఎన్‌డీఏ నేతలు నోరు మెదపకపోవడం విచారకరం. డీఆర్సీ వేదికగా కరువు జాబితాలో జిల్లాకు చోటు కల్పించేందుకు తీర్మాణం చేయడం, మంజూరైన ఎంఎస్ఎంఈ (కొప్పర్తి) టెక్నికల్ సెంటర్‌ను ఇక్కడే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం, పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లు రద్దు చేయడం ఇలాంటి వాటిపై కూడా స్పందించలేదు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి మాట్లాడితే, అందుకు అండగా నిలవాల్సిన జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఎదురుదాడి చేయడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ అంటూ...

ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు విజన్2020 అంటూ ఊదరగొట్టారు. 2024లో ఏమో స్వర్ణాంధ్రప్రదేశ్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అదే మాటను ఆయన కేబినేట్ వల్లెవేస్తోంది. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో అధికారులంతా భాగస్వామ్యం కావాలని మంత్రి సవిత వెల్లడించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ ఏమోగానీ కడప శివార్లలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో మంజూరైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతికి తరలించారు. జిల్లాకు మంజూరైన మెడికల్ సీట్లనూ రద్దు చేశారు. ఇక ఉక్కు పరిశ్రమ కలగా మిగిలింది. పూర్తి కోసం నిర్దిష్టమైన ప్రణాళికలేవి చర్చకు రాలేదు. రిజర్వాయర్లు ఉన్నా, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ లేకపోవడంతో సాగునీరు సాధ్యపడలేదు. రైతులకు ఆ దిశగా ఎలాంటి హామీ డీఆర్సీ వేదికగా చర్చించకపోవడం గమనార్హం.

విభేదాలు బట్టబయలు

ఇన్‌చార్జ్ మంత్రి సవిత పర్యటనలో టీడీపీ నేతల మధ్య విభేదాలు స్పష్టంగా కన్పించాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తన కార్యాలయం వద్ద మంత్రికి స్వాగతం పలికారు. అక్కడే కార్పొరేటర్ ఉమాదేవి, ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కలిశారు. తర్వాత ఆర్అండ్‌బీలో చేపట్టిన ఎన్‌డీఏ నేతల సమన్వయ సమావేశానికి వారు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య జిల్లాలో ఉన్నా ఈ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయా రు. కడప ఆర్అండ్‌బీలో సైతం గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ లాంటి నాయకులు కూడా ఎమ్మెల్యే మాధవితో కలిసి మంత్రికి స్వాగతం పలకకపోవడం గమనార్హం.

తిష్టవేసిన టీడీపీ నేతలు

డీఆర్సీ సమావేశంలో ప్రజాప్రతినిధులకే ప్రవేశం కల్పించాలని నిబంధనలు చెబుతోన్నా, అధికార పార్టీకి మినహాయింపు ఇచ్చారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జీలు భూపేష్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, బీటెక్ రవి సమావేశం ప్రారంభం నుంచి ముగింపు వరకూ కొనసాగించారు. ఎలాంటి ప్రొటోకాల్ లేకపోయినా డీఆర్సీలో తిష్టవేశారు. వీరే కాకుండా జంబాపురం రమణారెడ్డి, జయశేఖర్ లాంటి ద్వితీయా, తృతీయ శ్రేణి నేతలు కూడా డీఆర్సీలో ఆశీనులయ్యారు. ఇంకోవైపు ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి రిమ్స్ అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉంది.

జిల్లాను కరువు జాబితాలో చేర్చాలి



డీఆర్సీ సమావేశం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

జిల్లాను కరువు మండలాల జాబితాలో చేర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశ సందర్భంగా వారు ఆందోళన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాలు లేక జిల్లా అంతటా తీవ్ర కరువు తాండవించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం విచారకరమన్నారు. ఇప్పుడైనా శాస్త్రీయ పద్ధతిలో లెక్కగట్టి కరువు బారిన పడిన ప్రతి మండలాన్ని కరువు జాబితాలో చేర్చాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రుణాల రీషెడ్యూల్, తదితర ప్రయోజనాలు రైతులకు కల్పించి తక్షణమే ఆదుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొప్పర్తి నుంచి తరలించిన ఎంఎస్ఎమ్ఈ టెక్నాలజీ సెంటర్ తిరిగి కడపకు తీసుకు రావాలన్నారు. సీపీఐ నాయకులు వెంకట శివ, ఎంవీ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, జి వేణుగోపాల్, కే.సి. బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీసీలను కలవడానికి తీరికలేదా?

కడప రూరల్: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన పలు బీసీ వర్గాలకు చెందిన నేతలకు చేదు అనుభవం ఎదురైంది. ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట గంటల తరబడి ఎదురుచూసినా ఆమెను కలవడానికి అవకాశం కలగలేదు. దీంతో బీసీ, వాల్మీకి తదితర సంఘాలకు చెందిన నేతలు మంత్రి అనుచరులతో వాగ్వాదానికి దిగారు. మమ్మల్ని కలవడానికి మంత్రికి సమయం లేదా.. అని నిలదీశారు.

- శాంతి భద్రతల విషయంలో పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె అభిప్రాయం ఇబ్బందికి గురయ్యారు. 'ఇప్పుడు నేనేమి మాట్లాడలేను .. అంటూ ఆ అంశాన్ని దాటవేశారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

చంద్రబాబు హయాంలో అభివృద్ధి జరిగిందా లేక జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అభివృద్ధి జరిగిందా అనే అంశంపై చర్చించేందుకు తాను సిద్ధమని మంత్రి సవిత మంగళవారం సవాల్ విసిరారు. కడపలో జిల్లా సమీక్ష సమావేశం ముగిసిన తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించకుండా జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బద్వేలు సంఘటనను రెక్టిపై చేయడంతో పాటు నిందితునికి కఠిన శిక్షలు విధించామని అబద్ధాలు చెప్పడం గమనార్హం. మెడికల్ సీట్లు వెనక్కి వెళ్లిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నామంటూ మంత్రికి బదులు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

- డీఆర్సీ సమావేశంలో మంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అన్నారు. మంగళవారం కలెక్టరేటలో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చ సాగింది. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ పూర్తయ్యాక కూడా నిజాలు వెల్లడి కాకపోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాధవీ మాట్లాడుతూ బీసీ సంక్షేమశాఖ పరిధిలోని బాలికల హాస్టల్ నిర్వహణ జరిగా లేదన్నారు. వసతులు లేని హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలన్నారు. కడప నగరంలో సుమారు 15 వేల కుటుంబాలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబు గండికోట సందర్శనకు వస్తున్నప్పటికీ జిల్లా అధికారులు ఆ విషయంపై తమకు సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. కొండాపురంలో నిలిచిపోయిన 108 అంబులెన్స్ సేవలు పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నమయ్య డ్యాం నిర్మించాలి: ఆకేపాటి

అన్నమయ్య డ్యాం నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి ఇన్‌చార్జి మంత్రిని కోరారు. అప్పట్లో చిత్తూరు జిల్లాలోని చెరువులు తెగిపోవడం వల్ల అకస్మాత్తుగా వరదలు సంభవించడంతో అన్నమయ్య డ్యాం తెగిపోయిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో టెండర్లు నిర్వహించి పనులు చేపట్టే దశలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించి త్వరితగతిన డ్యాం నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం విమర్శలకు స్వస్తి చెప్పి హామీలు నెరవేర్చడంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

రూల్స్ జానా్తా నై!



విస్తరించాల్సిన ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు

- ఎమ్మెల్యే వరద కుమారుడికే రోడ్డు కాంట్రాక్టు పనులు?
- లెస్‌కు వేసిన వాళ్లను కాదని ఎక్సెస్ టెండర్ కోడ్ చేసిన వారికే పనులు!

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన టెండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డికి దక్కినట్లు తెలుస్తోంది. పోటీకి వచ్చిన అధికార పార్టీ నేతతో సర్దుబాటు చేసుకుని తప్పించగా.. మరో టెండర్ వేసిన వైఎస్సార్‌సీపీ నేతను టెండర్ వేయకుండా అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రోడ్లు భవనాల శాఖ పరిధిలోని ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు విస్తరణకు రూ.3,53,10,068తో టెండర్లు పిలిచారు. మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద నుంచి వాసవీ సర్కిల్ వరకు ఈ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకుగాను గత నెలలో అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి బూతూరు వెంకటకృష్ణారెడ్డి కంపెనీ తరపున 4.5 శాతం ఎక్సెస్‌కు టెండర్ కోడ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ తరపున లెస్‌కు టెండర్ కోడ్ చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి నంద్యాలకు చెందిన ఎస్.బొజ్జయ్య కంపెనీ ద్వారా లెస్‌కు టెండర్ కోడ్ చేశారు.

ఎమ్మెల్యే కుమారుడికే టెండర్

నిబంధనల ప్రకారం పోటీపడిన కాంట్రాక్టర్లలో ఎవరు లెస్‌కు వేస్తే ఆసంస్థకే కాంట్రాక్టును ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. కాగా అధికార పార్టీ నేత ప్రభావం కారణంగా ఈ కాంట్రాక్టును 4.5 శాతం ఎక్సెస్ కోడ్ చేసిన కొండారెడ్డికే దక్కనుంది. లెస్‌కు కోడ్ చేసిన జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో వరద వర్గీయులు సర్దుబాటు చేసుకున్నట్లు సమాచారం. పైగా టెండర్ కోడ్ చేసిన శ్రీసాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ యజమానితో వరద వర్గీయులు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా లెస్‌కు కోడ్ చేసిన మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డికి టెండర్ దక్కకుండా చేశారు. ఈయన టెండర్ కోడ్ చేసిన కంపెనీ యజమాని బొజ్జయ్యను బెదిరించి టెండర్ నుంచి తప్పుకుంటున్నట్లు లేఖ రాయించి అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో టెండర్ కోడ్ చేసిన తర్వాత లెస్ కోడ్ చేసిన వారికే కాంట్రాక్టు పనులు అప్పగించాలి. ఈ విషయంపై వివరణ కోరడానికి ఆర్అండ్‌బీ ఎస్ఈ చంద్రశేఖర్‌ను రెండు రోజులుగా ఫోన్ చేస్తున్నా స్పందించని ఆయన మంగళవారం తాను డీఆర్‌సీ సమావేశంలో ఉన్నానని చెప్పడం గమనార్హం.

9న గండికోటకు సీఎం చంద్రబాబు రాక



కడప సెవెన్‌రోడ్స్: ఈ నెల 9వ తేదీన జిల్లాలోని గండికోటకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ ధృవీకరించారు. ముఖ్యమంత్రి అయ్యాక చంద్రబాబునాయుడు తొలిసారి వైఎస్సార్ జిల్లాకు రానుండటంతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేసేందుకు చర్యలను ముమ్మరం చేశారు.

పరీక్షలకు వేళాయె

- నేటి నుంచి ఎఫ్ఏ-2 ప్రారంభం
- అన్ని మండల కేంద్రాలకు చేరిపోయిన ప్రశ్నపత్రాలు



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాన్ని పరిశీలించేందుకు ఏటా నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు (ఎఫ్ఏ-2) ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 6వ తేదీ బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికి రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సిఈఆర్టీ) రూపొందిన పరీక్షా పత్రం ద్వారా పరీక్షలను నిర్వహించనుండగా ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం ఆయా యాజమాన్యాలు రూపొందించే సొంత ప్రశ్నపత్రాలతోనే పరీక్షలను నిర్వహించనున్నారు.

ప్రశ్నపత్రాలు మండల కేంద్రాలకు...

ఎఫ్ఏ-2 పరీక్షలకు సంబంధించిన 1 నుంచి 5వ తరగతి వరకు సంబంధించిన ప్రశ్నపత్రాలను స్కూల్ కాంప్లెక్స్‌లకు, 6 నుంచి 10వ తరగతి వరకు సంబంధించిన ప్రశ్న పత్రాలను మండల కేంద్రాలలోని ఎమ్మార్సీలకు తరలించారు.

ఏర్పాట్లు పూర్తి

జిల్లావ్యాప్తంగా ప్రారంభం కానున్న ఎఫ్ఏ-2 పరీక్షలకు సంబంధించి ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా సరఫరా అయిన ప్రశ్నపత్రాలను మండల కేంద్రాలకు తరలించాం. ఎఫ్ఏ-2 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. పరీక్ష జరిగే రోజు ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీ నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తారు. - విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ, డీసీఈబీ, వైఎస్సార్‌జిల్లా

పబ్లిక్ పరీక్షల్లాగే నిర్వహించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తేదీ నుంచి నిర్వహించే ఎఫ్ఏ-2 పరీక్షలను పబ్లిక్ పరీక్షలాగే నిర్వహించాలి. నిర్వహణకు సంబంధించి పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకున్నాం. ఇందుకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు అన్ని సూచనలను ఇచ్చాం. ప్రతి పేపరుపై జిల్లా కోడ్ ఉంటుంది. -మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

హామీల అమలులో కూటమి సర్కార్ విఫలం

- ప్రజా దర్బార్‌లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి సర్కార్ విఫలమైందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. మంగళవారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలో ఉన్న ఆయన నివాసంలో ఎంపీ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అడుగుతుంటే వారిపై అక్రమంగా కేసులు బనాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ప్రజల సమస్యలు విని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

105 బస్తాల రేషన్‌ బియ్యం పట్టివేత

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు – హిమకుంట్ల దారిలో రేకుల షెడ్డులో ఉన్న ప్రభుత్వ రేషన్‌ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు రేకుల షెడ్డులో రేషన్‌ బియ్యం డంప్‌ చేశారన్న విషయం తెలియడంతో విజిలెన్స్‌, రెవెన్యూ, పోలీసు అధికారులు దాడి నిర్వహించారు. ఆ షెడ్డులో 105 బస్తాల రేషన్‌ బియ్యం డంప్‌ చేసి ఉండటంతో వాటిని సీజ్‌ చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్‌ తెలిపారు.

టెట్‌ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



పి.భారతిని అభినందిస్తున్న సృజన్‌

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక సృజన్‌ కోచింగ్‌ సెంటర్‌ విద్యార్థులు సోమవారం విడుదలైన టెట్‌ ఫలితాల్లో ప్రతిభ చూపారు. పి.భారతి 137.26 మార్కులు, ఎ.అనూష 131.94, బి.సునీత 128.74, సి.సావిత్రి 128, టి.హేమావతి 123.45, ఎస్‌.సల్మా 122.63, టి.సాహిత్య 119.24, టి.ఓలమ్మ 114.62, పి.సరళ 110.35, ఎన్‌.దీప్తి 113.70, టి.షబానా 108.74, సి.అశ్వినిదేవి 106.18, బి.సునీల్‌ కుమార్‌ 106.06, బి.కృష్ణవేణి 104 మార్కులు సాధించారు. వీరిని కోచింగ్‌ సెంటర్‌ డైరెక్టర్లు కె.సృజన్‌, కె.సునీల్‌, అధ్యాపకులు సురేష్‌, ధనుంజయరెడ్డి, అల్లం శ్రీనివాసులు, నాగార్జున, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కరెస్పాండెంట్‌

కమలాపురం : కమలాపురం పట్టణంలోని ప్రగతి ఇంగ్లీష్‌ మీడియం హైస్కూల్‌కు చెందిన ఎం.మోక్ష అనే విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరెస్పాండెంట్‌ రాఘవరెడ్డి తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో పులివెందుల పట్టణంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌ టెన్నిస్‌ పోటీల్లో మోక్ష తన ప్రతిభను చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని దివాస్‌లో డిసెంబర్‌ నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌ తరుపున ఆమె ఆడనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఎం.మోక్షను కరెస్పాండెంట్‌తో పాటు పాఠశాల ఇన్‌చార్జి జోహెన్నాస్‌, పీఈటీ ఈషాక్‌ తదితరులు అభినందించారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్‌ జిల్లాల అండర్‌–14 క్రికెట్‌ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్‌ఆర్‌ఆర్‌–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండోరోజు కృష్ణా జట్టు బ్యాటింగ్‌కు దిగింది. 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. జట్టులోని తమన్‌సాయి 73, భానుచైతన్య 39 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్‌ సుశాంత్‌ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగుల వద్ద డిక్లేర్‌ చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది.

గుంటూరుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 151 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన విజయనగరం జట్టు 50 ఓవర్లలో 177 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని సాయినందన్‌ 65 పరుగులు చేశాడు. గుంటూరు బౌలర్లు గోపీచంద్‌ 5, షాన్‌ 5 వికెట్లు తీశారు. అనంతరం ఫాలోఆన్‌ ఆడిన విజయనగరం జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. జట్టులోని సాయినందన్‌ 30 పరుగులు చేశాడు. గుంటూరు బౌలర్‌ రిషి 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. కాగా గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో గుంటూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది.



వివేకానంద, శ్రీకాకుళం (148 పరుగులు)



నేత్రా కిరణ్‌, శ్రీకాకుళం (113 పరుగులు)

శ్రీకాకుళం జట్టుకు ఆధిక్యం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 156 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 81.5 ఓవర్లలో 315 పరుగుల వద్ద ఆలౌట్‌ అయింది. జట్టులోని నేత్రాకిరణ్‌ 113, వివేకానంద 148 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ ప్రారంభించిన అనంతపురం జట్టు 53 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. కాగా అనంత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 130 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక జార్జ్‌కారొనేషన్‌ క్లబ్‌ ఇండోర్‌ స్టేడియంలో 68వ ఎస్జీఎఫ్‌ఐ బాలబాలికల అండర్‌ –19 బ్యాడ్మింటన్‌ టీం ఛాంపియన్‌షిప్‌ పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం క్రీడాసాధన చేసి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. రెండవ స్థానంలో నిలిచిన కడప జిల్లా బాలికల జట్టును అభినందించారు. బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని కోరారు. టీం ఛాంపియన్‌షిప్‌ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో గుంటూరు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లాల క్రీడాకారిణులు నిలిచారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానం చిత్తూరు, ద్వితీయ స్థానం పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో కర్నూలు క్రీడాకారులు నిలిచారు. విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ అందజేశారు. పోటీలను జిల్లా స్కూల్‌గేమ్స్‌ కార్యదర్శి శారద, టోర్నమెంట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ జిలాని బాషా, టోర్నమెంట్‌ అబ్జర్వర్‌ శ్రీనివాసరావు, ఎస్జీఎఫ్‌ఐ కార్యదర్శులు అరుణ, విజయప్రసాద్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

శిల్పారామంలో నూతన సీఈఓ పరిశీలన

కడప కల్చరల్‌ : కడప శిల్పారామాన్ని మంగళవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈఓ వి.స్వామి నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కడప శిల్పారామం కార్యాలయంలో ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్‌ సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు. శిల్పారామమంతా కలియదిరిగి స్టాల్స్‌, బోటింగ్‌ పాండ్‌, బోట్ల కండీషన్‌, పచ్చిక మైదానాలను పరిశీలించారు. బోటింగ్‌ పాండ్‌లో బోటు షికారు చేసే వారు తప్పక లైఫ్‌ జాకెట్లు ధరించేలా చూడాలన్నారు. అలాగే రంగుల రాట్నాలు, జెయింట్‌ వీల్‌, ఇతర వినోద సాధనాల కండీషన్‌ గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమాత్రం కండీషన్‌ లోపం ఉన్నా వాటిని వాడరాదని, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసిన తర్వాత సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకున్నాకే వాటిని ఉపయోగించాలన్నారు. శిల్పారామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా చెత్తాచెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏజీ ప్రశాంత్‌, పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి, ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌ మధుసూదన్‌రావు, ప్లానింగ్‌ సూపర్‌వైజర్‌ శ్రీనివాసులురెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



శిల్పారామం సిబ్బందికి సూచనలిస్తున్న స్వామి నాయుడు

క్రీడా రిజర్వేషన్‌ పెంపుపై హర్షం

– క్రీడాపాఠశాల పూర్వ విద్యార్థులకు ఉద్యోగాలు

కడప స్పోర్ట్స్‌ : రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి పెంచడం పట్ల డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో పతకాలు సాధించే క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు భారీగా పెంచడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. నూతన క్రీడాపాలసీకి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డి, శాప్‌ ఛైర్మన్‌ రవినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు క్రీడాకారులకు ఉద్యోగాలు..

డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ క్రీడాపాఠశాలలో 10వ తరగతి వరకు చదివిన నలుగురు క్రీడాకారులకు ఉద్యోగాలు లభించినట్లు ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. వీరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించారని పేర్కొన్నారు. వెయిట్‌ లిఫ్టింగ్‌ క్రీడాకారుడు ఎ. శివరామకృష్ణ యాదవ్‌కు సౌత్‌ సెంట్రల్‌ రైల్వేలో టికెట్‌ కలెక్టర్‌గాను, మరో వెయిట్‌ లిఫ్టింగ్‌ క్రీడాకారుడు జి. రవిశంకర్‌ తమిళనాడు రైల్వే ఇంటిగ్రేటెడ్‌ కోచ్‌ ఫ్యాక్టరీలో జనరల్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు పొందారన్నారు. జిమ్నాస్టిక్స్‌ క్రీడాకారుడు జి. నిత్యసంతోష్‌ సికింద్రాబాద్‌ లల్లాగూడ క్యారేజ్‌ వర్క్‌షాప్‌లో టెక్నీషియన్‌గాను, హాకీ క్రీడాకారిణి బి. స్పందన కడప జిల్లా కోర్టులో జూనియర్‌ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్‌ కోటాలో ఉద్యోగం పొందారన్నారు. 2023–24 సంవత్సరంలో వీరంతా ఉద్యోగ అవకాశాలు దక్కించుకున్నట్లు తెలిపారు.

డీఏ, పీఆర్‌సీ అరియర్స్‌ చెల్లించాలి

కడప కార్పొరేషన్‌ : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏ, పీఆర్‌సీ అరియర్స్‌ వెంటనే చెల్లించాలని ఏపీ స్టేట్‌ గవర్నమెంట్‌ రిటైర్డ్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు జంబారపు అహరోను, కార్యదర్శి సి. గంగన్న కోరారు. మంగళవారం స్థానిక గుంత బజారులోని యూనియన్‌ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బకాయి ఉన్న రెండు విడతల కరువు భత్యం, 12వ పీఆర్‌సీ ముందు ఇంటీరియం రిలీఫ్‌ 30 శాతం చెల్లించాలన్నారు. పెరిగిన నిత్యావసర సరుకులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ అరియర్స్‌ ఇతర పెన్షనరీ బెనిఫిట్లు విడుదల చేయాలన్నారు. చాలా మంది పెన్షనర్లు ఈ లబ్ధి పొందకనే చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఈనెల 6వ తేదీ జరగబోవు కేబినెట్‌ సమావేశంలో సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి నరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు కేవీ సుహాసిని, పి. బాలచౌడన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్‌ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీ డ్రైవర్లు ఇంధన పొదుపును పాటించాలని జిల్లా ఇన్‌చార్జి ప్రజా రవాణాధికారి పి.లక్ష్మీభాస్కర్‌ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్‌ హాలులో ఫిర్యాదులు, డ్యామేజీ, అత్యల్ప ఇంధన పొదుపు చేసే డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మొదటగా డ్రైవర్లకు మానసిక ప్రశాంతత కోసం ధ్యానం, యోగా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటిస్తే ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తుందన్నారు. మైదుకూరు డిపో మేనేజర్‌ రాంకుమార్‌ మాట్లాడుతూ కేఎంపీఎల్‌ పెరుగుదలకు పంచ సూత్రాలను పాటించాలన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో తయారైన బీఎస్‌–6 వాహనాల గురించి తెలిపారు. అనంతరం రీజినల్‌ సేఫ్టీ డ్రైవింగ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ సుధా కృష్ణారెడ్డి, ఎస్‌డీఐ రామయ్య బస్సులో డ్రైవర్లను తీసుకెళ్లి ఇంధన పొదుపునకు సంబంధించి సూచనలు, రహదారి నిబంధనలు వివరించారు.

పెన్నా నదిలో బాలుడి గల్లంతు



మణికంఠ (ఫైల్‌)

కడప అర్బన్‌ : కడప నగరంలోని చిన్నచౌక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నివాసముంటున్న మణికంఠ(13) అనే బాలుడు ఈతకొట్టేందుకు స్నేహితులతో కలిసి పెన్నా నదికి వెళ్లి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో బాలుడు కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నచౌక్‌ సీఐ తేజమూర్తి, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రోన్‌ కెమెరాలతో నది చుట్టూ కెమెరాల ద్వారా పరిశీలించారు. ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో సిద్దవటం పోలీసుల సహకారం తీసుకున్నారు. బుధవారం పోలీసులు తిరిగి గాలింపు చర్యలు చేపట్టనున్నారు.


ప్రొద్దుటూరులో హీరో కిరణ్‌ అబ్బవరం సందడి



మాట్లాడుతున్న హీరో కిరణ్‌ అబ్బవరం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : 'క' సినిమా హీరో కిరణ్‌ అబ్బవరం మంగళవారం ప్రొద్దుటూరులో సందడి చేశారు. ఆయన హీరోగా నటించిన 'క' సినిమా విజయోత్సవం సందర్భంగా సుధ థియేటర్‌కు వచ్చారు. అభిమానులతో కలిసి సినిమాను కాసేపు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే థియేటర్‌లో తాను ఊసరవెల్లి సినిమా చూశానని, ఈ థియేటర్‌లోనే తన సినిమా 'క' రిలీజ్‌ కావడం తనకు సంతోషంగా ఉందన్నారు. ప్రొద్దుటూరు అంటే దసరా పండుగ గుర్తుకు వస్తుందని తాను దసరా వేడుకల్లో పాల్గొనేవాడినని ప్రొద్దుటూరుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన సినిమాను విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుజిత్‌, సందీప్‌, కిరణ్‌ అభిమానుల సంఘం అధ్యక్షుడు సురేష్‌, థియేటర్‌ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ కళాశాలకు ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌



ట్రోఫీలు, మెడల్స్‌తో క్రీడాకారులు, వైవీయూ అధికారులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్‌ కళాశాలల క్రీడా పోటీల్లో వైవీయూ పీజీ కళాశాల జట్టుకు ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ లభించింది. ఈనెల 3వ తేదీన వైవీయూలో నిర్వహించిన రెండోదశ క్రీడా పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్‌, పవర్‌ లిఫ్టింగ్‌, రైఫిల్‌ షూటింగ్‌, బెస్ట్‌ ఫిజిక్‌ విభాగాల్లో అత్యధిక పతకాలు సాధించి ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. పతకాలు, ట్రోఫీలు సాధించిన క్రీడాకారులు మంగళవారం విశ్వవిద్యాలయ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్‌ ఆచార్య పి. పద్మ, ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డిలను కలిసి పతకాలను, ట్రోఫీలను వారికి అందజేసి చూపించారు. ఈ సందర్భంగా వైవీయూ అధికారులు క్రీడాకారులను అభినందించారు. అంతర్‌ విశ్వవిద్యాలయాల పోటీల్లో సైతం ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్‌ కె. రామసుబ్బారెడ్డి, వ్యాయామవిద్య, క్రీడాశాస్త్రశాఖ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చాపాడు : సమాజంలో బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని వీటి వలన అనేక అనర్థాలు ఎదురవుతాయని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌ జి.సునీత అన్నారు. స్థానిక జీఎస్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్‌ సీడీపీఓ సావిత్రమ్మ ఆధ్వర్యంలో బాలికా సంరక్షణ, బాల్య వివాహాలు, మిషన్‌ వాత్సల్య వంటి వాటిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో బాల్య వివాహాలు చేయరాదన్నారు. పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలని వీరి కోసం ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. విద్యార్థినులు చెడు, మంచి స్పర్శపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

కోలుకుంటున్న విద్యార్థిని



విద్యార్థిని తల్లితో మాట్లాడుతున్న ఎంఈఓ -2 రామయ్య

ప్రొద్దుటూరు : కొండాపురం మండలంలోని చౌటపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థిని కోగటం వర్షిణి స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటోంది. ఆదివారం అర్ధరాత్రి పాఠశాల హాస్టల్‌ ఆవరణలో కింద పడుకొని నిద్రిస్తుండగా ఇద్దరు విద్యార్థినులను పాము కరిచి తీవ్ర అస్వస్థతకుగురయ్యారు. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు విద్యార్థిని వర్షిణిని స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. బీజేపీ నాయకురాలు సీవీ జయలక్ష్మి, లోకా సంస్థ హ్యూమన్‌ రైట్స్‌ ఫోరం రాయలసీమ ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసన్న పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్ద మనసు చాటుకున్న మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌

పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న ఎస్సీ బాలిక వర్షిణిని పరామర్శించడంతోపాటు ఆమె చికిత్స కోసం మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాతకోట బంగారు మునిరెడ్డి రూ.20వేలు ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమని ఏపీ ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌ మాదిగ తెలిపారు. కొండయ్య, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరా తీసిన ఎంఈఓ

కొండాపురం : పాముకాటుకు గురై ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి పై మండల విద్యాశాఖ అధికారి-2 రామయ్య మంగళవారం వైద్యులతో మాట్లాడారు. విద్యార్థిని కోలుకుంటోందని, ప్రాణాపాయం లేదని తెలిపారు. ప్రిన్సిపాల్‌ క్రిష్ణవేణి ఆసుపత్రి వద్దనే పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేతివాటం ప్రదర్శిస్తున్న డీలర్‌

- ఇదేమని ప్రశ్నించిన లబ్ధిదారులకు బెదిరింపులు
- మీ ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకోండి అంటూ హూంకరింపు



తూకం మిషన్‌పై చక్కెర మూట పెట్టి తూకం వేస్తున్న డీలర్‌

జమ్మలమడుగు : రేషన్‌ డీలర్‌ చేతి వాటం ప్రదర్శించడంతోపాటు ఎక్కువ మాట్లాడితే బాగోదు. మేము పది కేజీలకు కేజీ, 20 కేజీలకు రెండు కేజీల బియ్యం తీసుకోవాలసిందే. మాకు ఎటువంటి ఆదాయం లేదు. కాబట్టి మేము తప్పని సరిగా లబ్ధిదారులకు తక్కువ చేయాల్సిందే అంటున్నాడు పట్టణంలోని 14వ వార్డు డీలర్‌ బిద్రు ఫిలిప్స్‌. నవంబర్‌ నెలకు సంబంధించిన రేషన్‌ బియ్యంతోపాటు, చక్కెర, కందిబేడలు పంపిణీ చేస్తున్నారు. గోదాముల నుంచి బియ్యం తమకు తక్కువగా వచ్చాయని దీంతో తాము కూడా లబ్ధిదారులకు తక్కువ ఇవ్వడంతో పాటు తమ ఆదాయం చూసుకుంటున్నామంటూ బాహాటంగానే చెబుతున్నారు. మేము ఇచ్చేది ఇంతే. తీసుకుంటే తీసుకోండి లేకుంటే వాటిని కూడా మేమే అమ్ముకుంటామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దిగువపట్నం కాలనీలో ఉన్న డీలర్‌ కుమార్తె పట్టణంలో సచివాలయం ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆమె సైతం రేషన్‌కోసం వచ్చిన వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. తూకం వేసే మిషన్‌పైనే కేజీకిపైగా ఉన్న చక్కెర మూటను పెట్టి భయం లేకుండా పంపిణీ చేస్తున్నారంటే వారిని ఏమనాలో అర్థం కావడం లేదంటూ ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం మారడంతోనే...

గతం ప్రభుత్వంలో రేషన్‌ లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ జరిగింది. అయితే ప్రభుత్వం మారడంతో ఆగమేఘాల మీద మార్పులు చేశారు. డీలర్లు తమ ఇష్టానుసారం రేషన్‌ పంపిణీ చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా 'మీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లి చెప్పుకోపోండి తాము చేసేది ఇంతే' అంటూ హూంకరిస్తున్నారు. ఉన్నతాధికారులు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి వచ్చింది

పట్టణంలో రేషన్‌ దుకాణంలో పంపిణీ సక్రమంగా జరగడం లేదని మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే చాలా దుకాణాల వద్దకు వెళ్లి పరిశీలించాము. ఫిలిప్స్‌ దుకాణంపైన ఫిర్యాదులు వస్తున్నాయి. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి. శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్‌, జమ్మలమడుగు.

ఎస్‌జీఎఫ్‌ జిల్లా టెన్నికాయిట్‌ జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలోని మున్సిపల్‌ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ జిల్లాస్థాయి టెన్నికాయిట్‌ ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను వైఎస్‌ఆర్‌ కడప జిల్లా స్కూల్‌ అసిస్టెంట్‌ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కగా రాణించి జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్‌–14 బాలికల జట్టు : ఎం. మానస, ఎల్‌.వైష్ణవి, ఐ.తేజస్విని, వి. సుష్మ, పి.నాగ తనూజ.



అండర్‌-14 బాలికల జట్టు

అండర్‌–17 బాలికల జట్టు : డి. చరిత, జె.హేమలత, జె.హన్షిత, ఎం. సునంద, ఆర్‌.పూజిత.
అండర్‌–14 బాలురు : ఇ.బాలభాస్కర్‌, వి. భరత్‌, జి.వి.మహేష్‌ ఎం.చరణ్‌, పి.రెడ్డయ్య.
అండర్‌–17 బాలురు : కె.లక్ష్మీనరసింహ, ఎం.చరణ్‌ కుమార్‌, పి.దీపక్‌, పి.ఖలీల్‌, పి.చరణ్‌.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఇచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్‌ డిమాండ్‌ చేశారు. ఈ నెల 11న భవన నిర్మాణ కార్మికులు చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నగరంలోని సంధ్య సర్కిల్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికులు, లారీ, ట్రాక్టర్ల యజమానులు, కార్మికులు పనులు కోల్పోయారన్నారు. ప్రభుత్వం స్వయంగా నిర్మిస్తామన్న ఇంటి నిర్మాణాలను కూడా అయోమయంలో పడేశారన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన ఉచిత ఇసుక విధానాన్ని అధికారంలోకి వచ్చి 150 రోజులు దాటినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్‌ సెక్రెటరీ కేసీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, నాయకులు జాఫర్‌, నానపాటి, సుంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

1.7 కిలోల గంజాయి పట్టివేత



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న రూరల్‌ సీఐ శివశంకర్‌, ఎస్‌ఐ చిన్న పెద్దయ్య

చాపాడు : మండల పరిధిలోని మదూరు పంచాయతీ చెంచుపల్లె గ్రామం వద్ద మంగళవారం ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు రూరల్‌ సీఐ శివశంకర్‌ తెలిపారు. రూరల్‌ సీఐ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన లారీ క్లీనర్‌ జొన్నకూటి తిరుమలరావు 1700 గ్రాముల గంజాయిని మండలంలోని చెంచుపల్లె గ్రామ సమీపంలో గల చెరువు దగ్గరికి తీసుకువచ్చాడు. దీనిని తీసుకునేందుకు ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్‌ మేకల సునీల్‌(మత్తయ్య), కూలి పని చేసుకునే సురసుర శ్రీనివాసులు, పెయింటర్‌ పని చేసే పాపగాళ్ల సుధీర్‌, స్వరాజ్యనగర్‌కు చెందిన గుర్రం రమేష్‌లు వచ్చారు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ చిన్న పెద్దయ్య, పోలీసు సిబ్బందితో కలసి దాడి చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్‌ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 1.7 కిలోల గంజాయి విలువ రూ.18,000 చేస్తుందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు రూరల్‌ సీఐ తెలిపారు.

వెల్లాలకు రూ.5.47 లక్షల ఆదాయం

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ఈఓ బీవీ నరసయ్య, పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. ఆలయాలకు సంబంధించిన కల్యాణ మండపాన్ని రాజుపాళెం మండలంలోని గోపాయపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి రూ.3,38,000లకు దక్కించుకున్నారు. అలాగే ఇదే కల్యాణ మండపానికి సంబంధించి డెకరేషన్‌ను నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన సుబ్బన్న రూ.లక్షకు దక్కించుకున్నారు. అనంతరం స్వాములకు భక్తులు సమర్పించిన పలు రకాల వస్తువులను వేలం వేశారు. అందులో పెసరబేడలతో కూడిన బియ్యం రూ.99వేలు, బెల్లం రూ.4,294, నువ్వుల నూనె రూ.2,775, ఆముదం రూ.1290, పెరబేడలు రూ.1740 పలికిందన్నారు. మొత్తం రూ.5,47,009 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.